# ★ మాలగూడెంలో మంటలు !!—

• సూరిశెట్టి సాంబశివరావు బాబ్జీ •

'జగ్గయ్యా'

'చిత్తం'

'రాత్రేం అంత లేటుగా వొచ్చావ్ ?'

'మాలగూడెం అంతా ముట్టుకుపోయిందండి'

'అగ్గి అంటుకుందా ?'

'అవునండి. అయిదు వందల కొంపలదాకా మసి అయిపోనాయండి'

'ప్రాణనష్టం యేమీ లేదుగదా !'

'అదిమాత్రం కాలేదండి బాబూ'

'అసలు యెలా అంటుకుంది ?'

'యెండాకాలంగదండి. అదీగాక ప్రపంచకం అంతా మాడిపోతున్నాదండి.'

'అదికాదోయ్ అసలుకీలకం !'

'చిత్తం, సెలవియ్యండి'

'హరిజనులకోసం మన గవర్నమెంటు కోటి రూపాయిలు కేటాయించి నిలవచేసిందన్న సంగతి ఆ సూర్యుడిదాకా వెళ్ళిపోయివుంటుంది.'

'అదీ నిజమేనండి. లేకపోతే అందరి గుడిసెలూ వొదిలేసి ఆ మాలోళ్ళ కొంపలకే అగ్గంటుకోడమేటి, యిద్దూరం !'

'ఇలాంటివేమేనా జరుగుతాయనే మన కాంగ్రెసు ప్రభుత్వం బాగా ఆలోచించి వాళ్ళకోసం కోటి రూపాయిలు రిజర్వుచేసిందోయ్'

'కోటికాదండి. యిప్పుడు పాపం ఆ దిక్కుమాలినోళ్ళకాడ గెంజికి దమ్మిడీ లేదండి. ఒక్క మంత్రేనా కనిపించినారుగాదండి యీ ఆపదసమయంలో'

'మంత్రులకేం అవసరమొచ్చింది చెప్పా వొచ్చి చూడటానికి ?'

'ప్రజ లవసరం లేకపోతే ప్రభుత్వం యెందుకేటి బాబయ్యా ?'

'ప్రజలెలా అయిపోతే ప్రభుత్వానికేం ?

'ఇది కాంగ్రెసు ప్రభుత్వంలాగ లేదండి.'

'మరెలా వుందంటావ్ ?'

'ఆ వుద్యోగస్థులెక్కడ తర్ఫీదయారు ?'

యింగ్లీషు తెల్లదొరలదగ్గరేగదండి !'

'అలా దార్లోకి రా. వాళ్ళే యిష్టమొచ్చినట్టు అధికారం చలాయిస్తున్నారు.'

'అంతా వాళ్ళిష్టమే అయితే మన కాంగ్రెసు మంత్రులెందుకండీ ?'

'పదిహేను వందల రూపాయిల జీతానికి'

'నిజంగా తెల్లదొరలు పోయి నల్లదొరల రాజ్యమె నడుస్తున్నాదండి'

'మన కాంగ్రెసు యవ్వారాలన్నీ యిట్టా వుండబట్టే ఆ సోషలిస్టులు వొదిలి పైకెళ్ళిపోతున్నారండి'

'అదే తప్పంటాను. కాంగ్రెసులోనే వుంటూ పాటుపడాలి'

'పాపం పాటుపడ్డంతవరకూ కాంగ్రెసోళ్ళకన్నా యెక్కువే పడ్డారండి. స్వరాజ్యం చేతిలో పడగానే కాంగ్రెసోళ్లు వాళ్ళని పైకి తగిలేసినారు'

'సోషలిస్టులూ, కమ్యూనిష్టులూ ఒకటేనోయ్'

'కాదండి. రష్యాపార్టీకి, సోషలిస్టు పార్టీకి నరకానికీ, స్వర్గానికీ వున్నంత తేడా ఉన్నాదని ఆ నారాయణబాబు ఢంకామీద దెబ్బకొట్టి చెప్తూంటే యిద్దరూ ఒకటే అంటారేటండి ?'

'నారాయణెవరు ? జయప్రకాశ్ నారాయణా ?'

'చిత్తం, వారేనండి'

'నిజమేకాని కాంగ్రెసు ఒకటి వుంటూండగా మళ్లా పోటీగా సోషలిస్టుపార్టీ యెందుకోయ్ ?'

'పోటీ యేదేనా ఒకటి వుండాల బాబయ్యా, యెప్పుడుచూసినా కాంగ్రెసు డబ్బుగలోళ్ళకే సాయంచేస్తున్నాది కాని బీదోళ్ళపక్క చూడ్డంలేదు. అంతదాకా యెందుకు ? ఆ మాలోళ్ళు పాపం ఆ రాత్రిపూట ఆలోపాలోమని యేడుస్తుంటే అఖరికా సోషలిస్టు కుర్రోళ్ళంతా వొచ్చి కాసింత సాయపడ్డారుగాని రాజభోగా లనుభవించే కాంగ్రెసు నాయకుడొక్కడూ కనిపించనేలేదండి'

'ఓహో. అందుకా వాళ్ళు మంచివాళ్ళంటున్నావ్ ?'

'దేనికైనానండి. కాంగ్రెసోళ్ళు పెదవులపై మాటలేనండి చేసేయన్నీ రైతోళ్ళీ, కూలోళ్ళీ, అణగదొక్కేసే పనులేనండి'